
# ఉత్తమరచయిత

— పి.వి.ఆర్. శివకుమార్




ఆ పత్రిక కళ్ళముందు పెట్టుకుని అలాగే కూర్చున్నాడు జమదగ్ని ఆ పత్రిక లోని ఉత్తరాల శీర్షిక తెరిచి చూస్తుంటే ఆనందంతో మైమరపు కలుగుతోం దతనికి

ఒకటి కాదు—రెండు కాదు—ఏడు ఉత్తరాలు! అందులో నాలుగు ఉత్తరాలు పెద్దవిగా — చిన్నసైజు సమీక్షల్లా! పేలాల కాశీరాం, బుహారీల సోంచందర్, కుళలాకేశవ్ వరసాగ్గా ఆ ఏడుత్తరాలు రాసిన పాఠకుల పేర్లూ, ఉత్తరాలూ మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు జమదగ్ని

సరిగ్గా రెండు వారాలక్రితం జమదగ్ని రాసిన కథ ఆ వారపత్రికలో ప్రచురించ బడింది, కథలు పడటం జమదగ్నికికొత్త కాదు ఈ ప్రసిద్ధ వారపత్రికలో పడటం మాత్రం ఇదే మొదటిసారి 'ఉత్తరాల శీర్షిక'కి అత్యంత ప్రాధాన్యమిచ్చే పత్రిక కావటాన జమదగ్ని కథమీద అన్ని ఉత్తరాలు అచ్చయ్యాయి

ఆ ఉత్తరాల్లోని పొగడ్తలు జమదగ్ని ఆశించనివి—అసలు ఊహించనివి! తన కథ అంత గొప్పగా వుందని, నిజానికి ఆ ఉత్తరాలు చదివేదాకా అతనికీ తెలియదు! ఆ ఉత్తరాలే అతన్ని ఉత్తమ రచయితగానూ, 'హైలైట్' కథ రాసిన రచయితగానూ అభివర్ణించాయి!

జమదగ్ని అంతగా ఆనందించడానికి ఆ ఉత్తరాల్తోపాటూ ఇంకో కారణం కూడా వుంది. అది, ఆరోజు లంచ్‌లో, ఆఫీసు మిత్రుల్తో జరిగిన కాలక్షేపం! చాలామంది స్నేహితుల(?)కి జమదగ్ని

కథ(లాస్తాడన్న విషయం ఈ కథ పడిన తరవాతే తెలిసింది

వాళ్ళంతా, "మీ లాటివాడు మనా ఫీసులో వుండటం మనాఫీసు అదృష్టం గురుగారూ" అంటూ పొగిడెయ్యటం, కథ బాగుందని మెచ్చుకోవటం అతణ్ని మరింత సంతోషపడేలా చేశాయి.

'సో నేనూ రచయితనయ్యాను నాకూ పాఠకులు లభించారు నాకూ గుర్తింపు వొచ్చింది అనుకున్నాడు జమదగ్ని. ఆ పత్రికని కళ్ళముందునించి తియ్యకుండానే

అంత సంతోషంలోనూ అతనికి మరో (ఫ్రెండ్ సాంబశివరావు మాటలు చేదుగా గుర్తొచ్చాయి.

"ఈ ఉత్తరాల్ని నమ్మకు జమదగ్నీ! ఇవన్నీ తమ పేర్లు పత్రికల్లో పడటం కోసం రాస్తుంటారు వాళ్ళు "

మధ్యాహ్నం జమదగ్ని ఉత్తరాల శీర్షిక చదూతుండగా అన్నాడు సాంబ శివరావు

"అంటే ఉత్తరాల శీర్షిక బోగస్ అంటావా?" విసురుగా అడిగాడు జమ దగ్ని

"నిజానికి ఉత్తరాలు రచయితకి (ప్రాణం కానీ, ఈనాడు అన్నిటిలాగే ఇదీ 'కమర్షియలైజ్' అయిపోయింది! అచ్చులో తమ పేరుకోసం ఉత్తరాలు రాస్తున్నవాళ్ళు ఎక్కువయిపోయారు— అందుకోసమే పనికిరాని చెత్తనంతా కథ లుగా రాసేవాళ్ళలాగా. వీళ్ళు తమ నిష్పాక్షికాభి(ప్రాయాలుగానీ, కథలోని గుణ దోషాలుగానీ చర్చించరు అది తమ 'వర్డిక్ట్' అన్నట్టు—ఫలాని, కథ అద్భుతం—ఫలాని శీర్షిక అపూర్వం — అంటూ రాసేస్తారు పత్రికలవాళ్ళూ తమ పత్రిక ఎంతటి (ప్రజాదరణ పొందిందో చాటుకోవటానికి ఈ ఉత్తరాల్ని (ప్రచు రిస్తున్నారు—నిజమయిన విమర్శలకి స్థానం కరువుచేస్తూ "

"ఆహా! తమరి అమూల్యాభి(ప్రాయా నికి ఆధారమేమిటో?"

జమదగ్ని మాటల్లోని వెటకారాన్ని పట్టించుకోకుండా, అనునయంగాఅన్నాడు సాంబశివరావు,

"కావాలంటే కొన్నాళ్ళు అబ్జర్వ్ చెయ్ జమదగ్నీ! ఈ ఉత్తరాలు రాసే వాళ్ళు—ఉత్తరాలకే కమిటై పోయినట్టు కనిపిస్తుంటారు—ఏ పత్రిక తిరిగేసినా, రేడియోలో ఏ కార్యక్రమం ట్యూన్ చేసినా—వీళ్ళ పేర్లే వినిపిస్తుంటాయి, అభినందనలు కురిపిస్తూ!"

"ఏమో! నిజమయిన (శ్రద్ధతో చదివి, అభి(ప్రాయాలు రాసేవాళ్ళు మన పాఠకుల్లో కొద్దిమందేననీ, వాళ్ల వీళ్ళేననీ అనుకో కూడదా?"

"అలా అనుకుందాం పోనీ! అయితే, ఒక పాఠకుడికి ఎప్పటికీ ఒకేరకం అభి(ప్రాయం వుండాలా? వీళ్ళలో చాలా మందికి అదేం వుండదు ఇవాళ నువ్వు అభ్యుదయ వాదాన్ని సమర్థిస్తూ రాస్తే, ఆహా! మో(డన్ రైటింగ్, సుపర్బ్- అంటూ రాస్తాడు రేపు మరో రచయిత సనాతన వాదస్త్రాల్ని పునరుద్ధరిస్తూ రాస్తే —ఓహో! (ప్రాచీన సంస్కృతిని నిల బెడుతున్నాడంటూ పొగుడుతారు!!

ఇవన్నీ పిన్నియర్‌గా ఫాలో అయేవా —రేపు నీకు మతిపోతుంది—అసలెలాటి కథ మంచిదో—ఎలాటిది మంచిదికాదో తెలియక!!"

"ఏమైనా ...పాఠకుల్ని ఇంత తక్కువగా తీసిపారెయ్యటం రచయితలకి భావ్యం కాదు!" అన్నాడు జమదగ్ని ఉడుక్కున్నట్టుగా.

గట్టిగా నవ్వాడు సాంబశివరావు.

"అయితే రచయితగారూ! మీ కథ బాగోలేదని ఉత్తరాలొచ్చినా మీరు ఇంతగానూ పట్టించుకునేవారా?"

"నువ్వేం వేళాకోళం చెయ్యనక్కర్లేదు. నాకు విమర్శలమీదా గౌరవం వుంటుంది!"

"అయితే, నే చెబుతున్నా విను. నీదొట్టి మీడియోకర్ కథ! ఈ పత్రికలో వచ్చే కథలన్నీ దాదాపు ఇలాటివే! ఆడదాని ఏడుపు, మగాడి నిరంకుశత్వం, మొగుడూ—పెళ్ళాల దెబ్బలాట—సెంటిమెంట్లు—సగటు తెలుగు సినిమా కథలు! ఇలాటిదే నీ కథానూ! కొత్తదనం లేని కథల్నే ప్రోత్సహించే ఈ పత్రికలో నీ కథ రావడం—పేరు దృష్ట్యా నీకు గొప్ప కావచ్చుగానీ, రైటర్‌గా నువ్వు ఎదగటానికి ఏమాత్రం పనికిరాదు. ఈ పత్రికలో పడటాన్నీ, ఈ పాఠకుల మూస ఉత్తరాల్నీ నువ్వు స్టాండర్డ్‌గా తీసుకుంటే, మోసపోతావ్!"

జమదగ్ని మొహం కందగడ్డలా అయిపోయింది.

"థాంక్యూ ఫర్ ది కామెంట్స్" విసురుగా అనేసి, అక్కణ్ణుంచి కదిలి వచ్చేశాడు.

'జెలసీ! పేరుకి స్నేహితులేగానీ—స్నేహితుడికి పేరొస్తేమాత్రం ఓర్చలేరు' అనుకున్నాడు మనసులోనే!

ఆ చేదు జ్ఞాపకం మరోసారి తల్చుకుని, అతడి అసూయకి నవ్వుకున్నాడు జమదగ్ని.

* * *


దాదాపు ఏడాది గడిచింది. ఈ ఏడాదిలోనూ ఆ పేరొందిన పత్రికలో మరో రెండు కథలు పడ్డాయి జమదగ్నివి. అప్పుడూ స్నేహితుల అభినందనల వర్షం, పాఠకుల ఉత్తరాల వర్షం అతడిని యథావిధిగా ముంచెత్తాయి. అయితే గత నాలుగయిదు నెలలుగా అతడి కథలు ఎక్కడా పడకపోవటంతో నిరుత్సాహంగా వుంటోందతనికి.

'ఇలాగే మరికొన్నాళ్ళు సాగితే కొన్నాళ్ళకి తనని మర్చిపోరు కదా పాఠకులు' అనుకుంటున్నాడు జమదగ్ని దిగులుగా.

ఆరోజు లంచవర్లో కారిడార్లో నలుగురైదుగురు ఫ్రెండ్స్ గుమిగూడి ఆ వారం పత్రిక తిరగేయటం కనిపించింది జమదగ్నికి.కుతూహలంగా అక్కడికి వెళ్ళాడు

"హార్టీ కంగ్రాట్స్! చాలా ఉత్తరాలొచ్చాయే! కథకూడా బావుంది లెండి ముఖ్యంగా హీరోయిన్ ఆత్మవిమర్శ ...'

జమదగ్నిని చూడగానే, ఒక కొలీగ్ పరిచయం చేశాడు, ఇతడు జమదగ్ని అని....అప్పుడప్పుడు కథలు కూడా రాస్తాడు, హలో జమదగ్నీ! ఈయన ముకుందరావనీ, కొత్తగా చేరారు. మంచి రచయిత. నువ్వు చూసేవుంటావు ఆట పోయినవారం కథల్లో 'అశల పాశాలు



అనే కథ వచ్చింది, ఫైన్ స్టోరీ ..."

ఉత్తరాల శీర్షిక చూశాడు జమదగ్ని.

పేలాల కాశీరాం. బుహారీల సోం చందర్, కుచలా కేశవ్ ..

అవే పేర్లు, అవే పడికట్టు పదాలు — కథపేరూ, రచయిత పేరూ మాత్రం మార్పు...

'హుఁ...రచయితల పేర్లు మారతాయిగానీ—వీళ్ళ పేర్లు, ధోరణీ మాత్రం మారదన్నమాట!'

ఉత్తరాల్లోంచి బయటికి వచ్చాడు.

"వెరీ గ్లాడ్ సార్! మీలాంటి రచయిత మా ఆఫీసులో చేరడం..."మిత్రుల అభినందనలు సాగుతున్నాయి.

అక్కడినించి కదిలి వచ్చేముందు ఒక్కసారి ముకుందరావు మొహంలోకి చూశాడు జమదగ్ని. అతడి మొహం దివిటీలా వెలిగిపోతోంది.

'చూడు బ్రదర్—ఈ ఉత్తరాలు వట్టి రాళ్ళు...

రాజ్యాలనేలే రాజులు మారుతుంటారు గానీ, వాళ్ళని పొగిడే భట్రాజుల మాటలు మాత్రం అవే! అవే!! ఆ మాటలు సింహాసనానికేగానీ, రాజుగావున్న ఆ మనిషికి కావు మరి!

'ఉత్తరాల రచయితల' పొగడ్తలూ అంతే! పత్రికలో పడిన కథకేగానీ, కథలోవున్న విషయానికి కాదు ఆ పొగడ్త. మళ్ళీ మాట్లాడితే కథకీ కాదు- అచ్చులో రానున్న తన పేరుకే!

అందుకే ప్రతీవారమూ ఏదో ఓ కథ హైలైటౌతూనూ వుంటుంది-ఎవరో ఒకరు ఉత్తమ రచయిత అయిపోతూనూ వుంటాడు.

అందుకే 'డోంట్ బి ప్రౌడాఫిట్!' అనాలనిపించింది జమదగ్నికి. కానీ, ఆ వెంటనే సాంబశివరావు గుర్తుకి వచ్చాడు. ఆ రోజున తన ఫీలింగ్స్ గుర్తుకి వచ్చాయి. మాట్లాడకుండా యివతలికి వచ్చేశాడు.

ఆ తరవాత ఎప్పుడూ జమదగ్ని ఉత్తరాల శీర్షికకోసం ఆత్రపడలేదు! □